RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైద్రాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 406 | 20 శనివారం జూన్ 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

# మనకు ఎప్పటికీ ఆయనే స్ఫూర్తి

## : రాహుల్ బర్త్‌డే సందర్భంగా రేవంత్ విషెస్

- నేడు రాహుల్ గాంధీ పుట్టినరోజు
- దేశ వ్యాప్తంగా వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు
- దేశానికి రాహుల్ సేవలు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించిన రేవంత్



నేడు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినం. ఏఐసీసీ పిలుపు మేరకు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున బర్త్‌డే వేడుకలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాహుల్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు పార్టీలకు అతీతంగా రాజకీయ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీకి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. "మనకు ఎప్పటికీ స్ఫూర్తిదాయక నాయకుడైన రాహుల్ గాంధీ గారికి నా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. భారతదేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడటం, సామాజిక న్యాయం అందించడం, ప్రజా సంక్షేమం పట్ల ఆయన చూపిస్తున్న అచంచలమైన నిబద్ధత కోట్లాది మందికి నిరంతరం కొండంత స్ఫూర్తినిస్తోంది. ఆయన దేశానికి, దేశ ప్రజలకు ఇలాగే తన నిరంతర సేవలను కొనసాగించాలి. రాహుల్ గాంధీ గారు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో, సంతోషంతో, మరింత శక్తితో వర్ధిల్లాలని నేను మనస్ఫూర్తిగా దేవుడిని కోరుకుంటున్నాను" అంటూ సీఎం రేవంత్ రెడ్డి తన ట్వీట్ లో పేర్కొన్నారు.రాహుల్ గాంధీ బర్త్‌డే సందర్భంగా తెలంగాణవ్యాప్తంగా ఉన్న గాంధీ భవన్ సహా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు కేకులు కట్ చేసి స్వీట్లు పంచుతున్నారు. పలు ప్రాంతాల్లో పేదలకు అన్నదానాలు, ఆసుపత్రుల్లో పండ్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

## మధ్యలోకి వస్తే ఖబడ్దార్.. మళ్లీ వెంటబడి ఓడిస్తాం

### : మంత్రి శ్రీధర్ బాబుకు కవిత మాస్ వార్నింగ్




ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో నిర్వహించిన సింగరేణి 'బాయిబాట' కార్యక్రమం తీవ్ర రాజకీయ వేడిని రగిల్చింది. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును టార్గెట్ చేస్తూ తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కార్మికులకు, మాకు మధ్య రావాలని చూస్తే ఖబడ్దార్. గతంలో చేసిన తప్పులకే నిన్ను వెంటబడి ఓడించాం. మళ్లీ అదే పునరావృతమైతే వచ్చే ఎన్నికల్లోనూ నిన్ను వెంటాడి మరీ ఓడిస్తాం" అంటూ మంత్రి శ్రీధర్ బాబుకు ఆమె మాస్ వార్నింగ్ ఇచ్చారు.బాయిబాట కార్యక్రమంలో భాగంగా కల్వకుంట్ల కవిత అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టు అండర్‌గ్రౌండ్ మైన్‌లోకి దిగి కార్మికులతో ముఖాముఖి మాట్లాడారు. నల్లబొగ్గు బావుల్లో కార్మికులు పడుతున్న కష్టాలను, ప్రాణసంకట పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒక కార్మికుడు తను అనుభవిస్తున్న ఇబ్బందులను వివరిస్తుండగా కవిత తీవ్ర చలనానికి లోనై మైన్ లోపలే కంటతడి పెట్టారు. కార్మికులకు తాము ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని, హక్కుల సాధన కోసం పోరాడుతామని భరోసానిచ్చారు.అనంతరం బొగ్గు గని వద్ద నిర్వహించిన భారీ గేట్ మీటింగ్‌లో కవిత మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, సింగరేణి యాజమాన్యంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉత్తర తెలంగాణకు ఆర్థిక వెన్నెముకగా నిలిచిన సింగరేణి సంస్థకు ప్రస్తుత ప్రభుత్వమే పెద్ద విద్రోహిగా మారిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి దాదాపు రూ. 50 వేల కోట్ల బకాయిలు పెట్టడం వల్లే సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని ఆరోపించారు. అధికారులకు ప్రొడక్షన్ టార్గెట్లు పెంచడంపై ఉన్న శ్రద్ధ... కార్మికులకు కనీస సౌకర్యాలు, ఆధునిక పనిముట్లు కల్పించడంపై లేదని మండిపడ్డారు."అండర్‌గ్రౌండ్ మైనింగ్‌లో మెషినరీని అప్‌గ్రేడ్ చేయడం లేదు. మ్యాన్ చైర్ మీద 45 నిమిషాల పాటు ప్రయాణించడం వల్ల కార్మికులు తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతున్నారు. సింగరేణిలో ఇప్పటికీ బ్రిటిష్ కాలం నాటి దోపిడీ వ్యవస్థ నడుస్తోంది. జేఎంఐటీ లో ఉన్న వారికి తొమ్మిదేళ్లు గడుస్తున్నా ప్రమోషన్లు ఇవ్వకుండా అధికారులు వేధిస్తున్నారు" అని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు.తాను సింగరేణి కార్మికులను కలవకుండా ఉండేందుకు గత నాలుగు రోజులుగా పోలీసులు ఆంక్షలు పెడుతూ అడ్డుకుంటున్నారని కవిత ఆరోపించారు. అసలు సింగరేణి పరిధిలోకి పోలీసులకు అనుమతే లేదని, గేట్ మీటింగ్‌కు వస్తే కార్మికుల జీతాలు కట్ చేస్తామని యాజమాన్యం బెదిరించడం దుర్మార్గమన్నారు. ఒక్క కార్మికుడి జీతం కట్ చేసినా తాను ఇక్కడే గని ముందే ధర్నాకు కూర్చుంటానని హెచ్చరించారు. రాబోయే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్ఎంఎస్ (ఎమీా) ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

## ఫుట్‌పాత్‌పై నడక ప్రాథమిక హక్కు

### : సుప్రీంకోర్టు కీలక తీర్పు



దేశంలో పాదచారుల భద్రతకు సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం ఒక కీలక తీర్పును వెలువరించింది. సక్రమంగా నిర్మించి, నిర్వహించే ఫుట్‌పాత్‌లపై నడవడం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. మోటారు వాహనాల రాకపోకల కంటే పాదచారుల హక్కులకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ధర్మాసనం తేల్చి చెప్పింది.జస్టిస్ పి.ఎస్. నరసింహా, జస్టిస్ ఏ.ఎస్. చందూర్‌కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(డి) (దేశవ్యాప్తంగా స్వేచ్ఛగా సంచరించే హక్కు), ఆర్టికల్ 21 (జీవించే హక్కు)లలో భాగంగానే ఫుట్‌పాత్‌పై నడిచే హక్కు కూడా ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. గౌరవప్రదమైన జీవనానికి సురక్షితమైన ఫుట్‌పాత్‌లు అత్యవసరమని, వాటిని కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జస్టిస్ నరసింహ తన తీర్పులో వివరించారు.కర్ణాటకలో చోటుచేసుకున్న ఒక విషాద ఘటన ఈ తీర్పునకు నేపథ్యంగా నిలిచింది. పాఠశాలకు వెళుతున్న ఒక బాలుడిని లారీ ఢీకొట్టడంతో అతడు మరణించాడు. ఆ ప్రాంతంలో సరైన ఫుట్‌పాత్ లేకపోవడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని తేలింది. ఈ కేసులో బాధితుడి కుటుంబానికి చెల్లించాల్సిన పరిహారాన్ని సుప్రీంకోర్టు రూ.11.44 లక్షలకు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది.దేశంలోని నగరాల్లో ఫుట్‌పాత్‌లు సక్రమంగా లేకపోవడం, ఆక్రమణలకు గురికావడం లేదా పూర్తిగా అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలను కోర్టు ప్రస్తావించింది. దీనిని ఒక నాగరికతా సమస్యగా న్యాయస్థానం అభివర్ణించింది. రహదారులు ఉన్న ప్రతిచోటా ఫుట్‌పాత్‌లను నిర్మించి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్లు, పురపాలక సంఘాలు, పంచాయతీలదేనని గుర్తు చేసింది. పాదచారుల హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ఒక సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని సూచించింది. ఈ చారిత్రాత్మక తీర్పు భవిష్యత్తులో పట్టణ ప్రణాళిక విధానాలపై గణనీయమైన ప్రభావం చూపుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## రాహుల్ పీఎం, రేవంత్ మరోసారి

# సీఎం కావడం ఖాయం

### : కడియం శ్రీహరి



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన బర్త్‌డే సెలబ్రేషన్స్‌లో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి భారీ కేక్ కట్ చేసిన కడియం.. దేశ, రాష్ట్ర రాజకీయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.రాబోయే రోజుల్లో దేశానికి రాహుల్ గాంధీ పీఎం కావడం, ఇటు తెలంగాణలో రేవంత్ రెడ్డి మరోసారి సీఎం కావడం వంద శాతం పక్కా అని కడియం శ్రీహరి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలంతా రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు."తెలంగాణలో మాకు ఇక ఎదురే లేదు, తిరుగే లేదు అన్నట్లు అహంకారంతో వ్యవహరించిన కేసీఆర్‌కు రాష్ట్ర ప్రజలు ఎలాంటి గుణపాఠం చెప్పారో మనమంతా చూశాం. రానున్న రోజుల్లో కేంద్రంలోని బీజేపీ, మోదీ ప్రభుత్వానికి కూడా దేశ ప్రజలు అదే రీతిలో బుద్ధి చెప్పడం ఖాయం" అని అన్నారు. దేశంలో బీజేపీ అనుసరిస్తున్న ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను రాహుల్ గాంధీ ఒంటరిగా ఎండగడుతున్నారని కొనియాడారు. అంబేద్కర్ స్ఫూర్తితో దేశ రాజ్యాంగాన్ని కాపాడేందుకు, అణగారిన వర్గాల బాధితులకు అండగా ఉంటూ పార్లమెంట్‌లో రాహుల్ గళం విప్పుతున్నారని ప్రశంసించారు.

## మోదీ 24 కోట్ల ఉద్యోగాలు బాకీ ఉన్నారు: జగ్గారెడ్డి




టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తన మార్క్ పొలిటికల్ కామెంట్స్‌తో మరోసారి వార్తల్లో నిలిచారు. సంగారెడ్డి వేదికగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జగ్గారెడ్డి, ఆయన భార్య ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, ప్రధాని మోదీపై జగ్గారెడ్డి విరుచుకుపడ్డారు.


సంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఓడీఎఫ్, ఇక్రిశాట్, ఐఐటీ హైదరాబాద్ లాంటి జాతీయ స్థాయి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలన్నీ నాడు కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చినవేనని జగ్గారెడ్డి గుర్తు చేశారు. కాంగ్రెస్ కష్టపడి నిర్మించిన ఇలాంటి ప్రభుత్వ ఆస్తులను... నేటి బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ప్రైవేటీకరణ చేస్తూ లూటీ చేస్తోందని మండిపడ్డారు."నెహ్రూ పాలనను బ్రేక్ చేశామని బీజేపీ నేతలు సంబరాలు చేసుకుంటున్నారు. రాహుల్ గాంధీ ముత్తాత (నెహ్రూ), నానమ్మ (ఇందిరా గాంధీ), తండ్రి (రాజీవ్ గాంధీ), తల్లి (సోనియా గాంధీ) ఈ దేశం కోసం ఏం త్యాగాలు చేశారో, ఎలాంటి సంస్థలు నిర్మించారో నేను ఆధారాలతో సహా వివరిస్తా. మరి గత 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న ప్రధాని మోదీ దేశానికి ఏం చేశారో బీజేపీ నేతలు సమాధానం చెబుతారా?" అని సూటిగా ప్రశ్నించారు.ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని... ఈ లెక్కన దేశ యువతకు ఇప్పటివరకు ఏకంగా 24 కోట్ల ఉద్యోగాలు బాకీ ఉన్నారంటూ జగ్గారెడ్డి మండిపడ్డారు. దేశం బాగుపడాలన్నా, నిరుద్యోగం అంతమవ్వాలన్నా రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేవలం ప్రెస్‌మీట్‌లకే పరిమితం కాకుండా.. రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకల జ్ఞాపకార్థం జగ్గారెడ్డి దంపతులు దాదాపు 350 మంది పాఠశాల చిన్నారులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేసి తమ ఉదారతను చాటుకున్నారు.

## 24 వరకు తెలంగాణలో వడగాల్పులు.. ఆ వెంటనే భారీ వర్షాలు కురిసే అవకాశం!



తీవ్రమైన ఎండలు, వడగాల్పులతో అల్లాడిపోతున్న తెలంగాణ, పొరుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఉపశమనం కలిగించే చల్లని కబురు అందించింది. వచ్చే నాలుగైదు రోజుల్లో నైరుతి రుతుపవనాలు తెలంగాణతో పాటు ఒడిశా, ఝార్ఖండ్, బీహార్, ఛత్తీస్‌గఢ్ లోని కొన్ని ప్రాంతాలకు విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ప్రకటించింది. ఈ ప్రాంతాల్లో కొంతకాలంగా పొడి వాతావరణం, తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో, రుతుపవనాల రాకతో వచ్చే వారం నుంచి వర్షాలు ఊపందుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన బలమైన ఎల్ నినో ప్రభావం కారణంగా నైరుతి రుతుపవనాల గమనం సాధారణం కంటే చాలా నెమ్మదిగా సాగుతోంది. దీనివల్ల దేశవ్యాప్తంగా వర్షాలు ఆలస్యం కావడమే కాకుండా, అనేక రాష్ట్రాల్లో వర్షపాత లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ఐఎండీ నివేదికల ప్రకారం దేశంలోని 741 జిల్లాల్లో 239 జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కాగా, మరో 230 జిల్లాల్లో అత్యంత తీవ్రమైన వర్షపాత లోటు ఏర్పడింది. ఈ జాప్యం ఖరీఫ్ సీజన్ సాగుపై, తాగునీటి వనరులపై తీవ్ర ప్రభావం చూపుతుండటంతో అటు వ్యవసాయ రంగం, ఇటు ప్రభుత్వ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.తెలంగాణలో రుతుపవనాలు విస్తరిస్తాయని చెబుతున్నప్పటికీ.. జూన్ 20 నుంచి 24వ తేదీ వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణతో పాటు ఉత్తరప్రదేశ్, విదర్భ, మరాఠ్వాడా ప్రాంతాల్లో కూడా ఈ ఎండల తీవ్రత కొనసాగనుంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఈ రుతుపవనాల సీజన్ మొత్తంలో దక్షిణాది రాష్ట్రాలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ తన దీర్ఘకాలిక అంచనాల్లో ఇప్పటికే స్పష్టం చేసింది.





బాలానగర్ డివిజన్ అధ్యక్షులు మధు గౌడ్ ఆహ్వానం మేరకు బాచుపల్లి లోని హజ్రత్ దర్గా జీతే పీర్ ను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థలు చేసిన పీసీసీ సభ్యులు టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం గారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్, డివిజన్ ల అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, మేకల రమేష్, ఏ బ్లాక్ మహిళ అధ్యక్షురాలు రమాదేవి, రాజేష్ గౌడ్, కృష్ణ వేణి, విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్–2026కు రంగారెడ్డి జిల్లా సర్వసన్నద్ధం

### పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేదు : కలెక్టర్ సి. నారాయణరెడ్డి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 19:–
రంగారెడ్డి జిల్లా: దేశవ్యాప్తంగా జూన్ 21న నిర్వహించనున్న నీట్ (చీజుజు)–2026 పరీక్షలను పకడ్బందీగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశించారు.
నీట్–2026 పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలో మొత్తం 23 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించిన ఆయన, వాటి పర్యవేక్షణ కోసం ముగ్గురు సిటీ కో–ఆర్డినేటర్లను నియమించినట్లు తెలిపారు.పరీక్షా కేంద్రాలను సంబంధిత తహసీల్దార్లు స్వయంగా సందర్శించి మౌలిక వసతులను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి కేంద్రంలో పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, సీసీ కెమెరాలు తదితర సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో కీలక బాధ్యతలు నిర్వర్తించే ఇన్విజిలేటర్లు, సెంటర్ సూపరింటెండెంట్లు మరియు ఇతర సిబ్బందికి తప్పనిసరిగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, నీట్ పరీక్ష నిబంధనలు, విధివిధానాలపై పూర్తి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని, అభ్యర్థుల ఫ్రిస్కింగ్‌ను కట్టుదిట్టంగా నిర్వహించాలని పోలీసు అధికారులకు సూచించారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ ద్వారా ప్రత్యేక బస్సు సౌకర్యాలు కల్పించాలని, స్థానిక సంస్థలు తాగునీరు సహా అవసరమైన సౌకర్యాలు అందించాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో వైద్య సదుపాయాలు, అత్యవసర వైద్య సహాయ వ్యవస్థ అందుబాటులో ఉండేలా వైద్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.విద్యుత్ శాఖ అధికారులు పరీక్షకు ముందు, పరీక్ష జరుగుతున్న సమయంలో, అనంతరం కూడా నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.నీట్–2026 దేశవ్యాప్తంగా అత్యంత ప్రాధాన్యమైన పరీక్ష కావడంతో చిన్నపాటి ఇబ్బందికి కూడా తావు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కిరణ్మయి, ఆర్డీఓలు, తహసీల్దార్లు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భావి భారతానికి ఆశాకిరణం రాహుల్ గాంధీ

### ఇందిరమ్మ ఆశయ సారథి.. రాజీవ్ కలల వారధి

### రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 19:–
ఇబ్రహీంపట్నం: భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్, టీపీసీసీ సభ్యులు మర్రి నిరంజన్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. “ఇందిరమ్మ ఆశయాలకు సారథిగా, రాజీవ్ గాంధీ కలలకు వారధిగా నిలుస్తున్న రాహుల్ గాంధీ దేశ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న నాయకుడు” అని పేర్కొన్నారు. నవతరం కోరుకుంటున్న నాయకత్వ లక్షణాలు రాహుల్ గాంధీలో ఉన్నాయని, దేశ అభివృద్ధి, సామాజిక న్యాయం, యువత సాధికారత కోసం ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, దేశ భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేస్తున్న రాహుల్ గాంధీకి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని మర్రి నిరంజన్ రెడ్డి ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకున్నారు.

## మహేశ్వరం పట్టణ కేంద్రంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు



( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూన్19:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గము మహేశ్వరం పరిధిలో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి,విద్య యొక్క ప్రాముఖ్యతతో పాటు సేవా భావం,సమానత్వం,సామాజిక బాధ్యత వంటి విలువలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ,యువత మరియు విద్యార్థులు సమాజ అభివృద్ధికి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని,విద్యతో పాటు మానవతా విలువలను అలవరచుకోవాలని సూచించారు.రాహుల్ గాంధీ ప్రజాసేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని సమాజంలో సానుకూల మార్పులకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు,ఎస్సీ సెల్ రంగారెడ్డి జిల్లా చైర్మన్ క్యారగారి శ్రీధర్ ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు వత్తుల నారాయణ,మహేశ్వరం మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పెంజర్ల యాదయ్య,మహేశ్వరం మండల ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బొల్లెపాక జంగయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు,నాయకులు,కార్యకర్తలందరికీ నిర్వాహకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## తెలంగాణకు కొత్త ఊపు.. రూ.87 కోట్ల రహదారి పనులకు శ్రీకారం

### మూడు హైస్పీడ్ రైలు మార్గాలతో తెలంగాణ అభివృద్ధికి కొత్త దిశ





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 19:–
రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో సుమారు రూ.87 కోట్ల వ్యయంతో చేపట్టిన రహదారి అభివృద్ధి పనులకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు–భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.
ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, కొంగర, రావిరాల, తిమ్మాపూర్, లాచునూరు, జబార్‌గూడ, ఎలిమినేడు, కప్పాడు, మీర్‌ఖాన్‌పేట తదితర ప్రాంతాలకు మెరుగైనరహదారి అనుసంధానం కల్పించేందుకు కేంద్ర నిధులతో పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్‌పూణే, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై మధ్య ప్రతిపాదిత హైస్పీడ్ రైలు కారిడార్లు తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనున్నాయని తెలిపారు. వీటికి సంబంధించిన సర్వేలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.
కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల అభివృద్ధికి రహదారి వ్యవస్థ బలోపేతం అత్యంత అవసరమని అన్నారు. కొనసాగుతున్న అన్ని రహదారి పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు–భవనాల శాఖ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## రాహుల్ జన్మదిన వేడుకలకు గాంధీ భవన్ వేదిక.. రక్తదాన శిబిరంతో సేవా కార్యక్రమాలు

### తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ గాంధీభవన్ మిద్దెల జితేందర్ అధ్యక్షులు





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 19:–
హైదరాబాద్: మిద్దెల జితేందర్ అధ్యక్షులు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్, హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కలిసి జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు మిద్దెల జితేందర్, దేశ ప్రజల హక్కుల పరిరక్షణ, సమాన అవకాశాల కల్పన, యువత భవిష్యత్తు, రైతాంగ అభ్యున్నతి, మహిళల అభివృద్ధి వంటి అంశాలపై రాహుల్ గాంధీ నిరంతరం స్వరం వినిపిస్తున్న నాయకుడని పేర్కొన్నారు. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం ఆయన రాజకీయ జీవితంలోని ప్రధాన లక్షణమని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలతో మమేకం కావాలనే లక్ష్యంతో నిర్వహించిన పాదయాత్రలు దేశ రాజకీయాల్లో కొత్త చైతన్యాన్ని తీసుకొచ్చాయని, సామాజిక సమానత్వం, ఆర్థిక అవకాశాలు, వెనుకబడిన వర్గాల సంక్షేమం వంటి అంశాలను జాతీయ స్థాయిలో చర్చకు తీసుకువచ్చిన నాయకత్వం రాహుల్ గాంధీదేనని జితేందర్ తెలిపారు.
జన్మదిన వేడుకల సందర్భంగా గాంధీ భవన్‌లో టీపీసీసీ మెడికల్ సెల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమంలో పలువురు నాయకులు, మహిళా ప్రతినిధులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. మహిళా సేవాదళ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేతిరెడ్డి శకుంతల రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన కంతి రేణుక తదితరులు రక్తదానం చేశారు.
రాహుల్ గాంధీ మరింత ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తూ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సేవాదళ్ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి ప్రతినిధులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంచాల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి

### ప్రజా కేంద్రిత పోలీసింగ్‌పై దృష్టి.. మంచాల్ పీఎస్‌లో కమిషనర్ సమీక్ష



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 19:–
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల్ ‘ ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచాల్ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ సందర్శించి స్టేషన్ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో అమలవుతున్న పరిపాలనా విధానాలు, ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల స్వీకరణ, వాటి పరిష్కార ప్రక్రియ, శాంతిభద్రతల నిర్వహణ, నేర నియంత్రణ చర్యలపై సమగ్ర సమీక్ష చేపట్టారు.
స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డుల నిర్వహణ విధానం, కేసుల పురోగతి, ప్రజా సేవల అందజేత తదితర అంశాలను పరిశీలించిన కమిషనర్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విధుల నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తున్న సిబ్బందిని అభినందిస్తూ, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు.
ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా బాధ్యతాయుతమైన పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించడం, కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను విస్తరించడం, నేరాల నివారణలో అప్రమత్తంగా వ్యవహరించడం వంటి అంశాలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు.
కమిషనర్ సూచనలు:
÷ ప్రజల ఫిర్యాదులను సకాలంలో నమోదు చేసి తక్షణ చర్యలు తీసుకోవాలి.
÷ విధి నిర్వహణలో క్రమశిక్షణ, పారదర్శకత, వృత్తి నైపుణ్యాన్ని పాటించాలి.
÷ బీట్ వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలతో మరింత అనుబంధాన్ని పెంపొందించాలి.
÷ నేరాల నియంత్రణ కోసం నిఘా చర్యలను మరింత పటిష్టం చేయాలి.
÷ స్టేషన్ రికార్డులు, పరిపాలనా వ్యవహారాలను క్రమబద్ధంగా నిర్వహించాలి.
÷ ప్రజలకు స్నేహపూర్వక వాతావరణంలో సేవలు అందించాలి.
ఈ కార్యక్రమంలో మహేశ్వరం జోన్ డీసీపీ నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం డివిజన్ ఏసీపీ కె.పి.వి. రాజు పాల్గొని కమిషనర్‌తో కలిసి స్టేషన్ పనితీరును సమీక్షించారు.
ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన పోలీసింగ్ సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోందని ఈ సందర్శన ద్వారా మరోసారి స్పష్టమైంది.

# ప్రభుత్వ విద్యాభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు మానాలి

## – తెలంగాణ పబ్లిక్ స్కూల్‌పై విమర్శలకు కాంగ్రెస్ నేతల కౌంటర్

## – పేద విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న పబ్లిక్ స్కూల్‌పై దుష్ప్రచారం తగదు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 19:-
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం: మంచాల్ మండలంలోని ఆరుట్ల గ్రామంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ వెదిరే హనుమంత్ రెడ్డి తెలంగాణ పబ్లిక్ స్కూల్‌పై వస్తున్న విమర్శలను తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో నాణ్యతను పెంపొందించేందుకు చేపట్టిన సంస్కరణల్లో భాగంగా ఈ విద్యాసంస్థను ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.

సమాజంలోని అన్ని వర్గాల పిల్లలకు అత్యాధునిక విద్యా సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ఈ పాఠశాలను అభివృద్ధి చేశామని, దీనిపై అనవసర ఆరోపణలు చేయడం విద్యార్థుల ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. సందేహాలు ఉన్నవారు ప్రత్యక్షంగా పాఠశాలను సందర్శించి, తల్లిదండ్రుల కమిటీ, ఉపాధ్యాయులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు.

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యకు సరైన ప్రాధాన్యత లభించలేదని, ప్రస్తుతం ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటోందని వారు తెలిపారు. ఆరుట్లలో ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ రాష్ట్రంలో ఆదర్శవంతమైన విద్యాసంస్థగా నిలిచేలా మౌలిక వసతులు కల్పించినట్లు వివరించారు.

పాఠశాలలో గ్రంథాలయాలు, సైన్స్ ప్రయోగశాలలు, డిజిటల్ తరగతి గదులు, క్రీడా మైదానాలు, భోజనశాలలు తదితర సదుపాయాలను ఏర్పాటు చేశామని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలన్నీ స్థానిక కమిటీల పర్యవేక్షణలో పారదర్శకంగా జరిగాయని స్పష్టం చేశారు.

కొంతమంది రాజకీయ ప్రయోజనాల కోసం అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించిన నాయకులు, గ్రామాభివృద్ధి అంశాల్లో రాజకీయ విభేదాలను పక్కనపెట్టి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి వివిధ అభివృద్ధి పనుల కోసం గణనీయమైన నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, కాలనీల అభివృద్ధి వంటి



కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొంటూ, అభివృద్ధిని అడ్డుకునే ధోరణులను ప్రజలు గుర్తించాలని కోరారు. విద్య, గ్రామాభివృద్ధి వంటి అంశాలను రాజకీయ వివాదాలకు వేదికగా మార్చకుండా ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# యూరియా పై అక్రమ దందా

హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి )



మద్దిరాల మండల కేంద్రంలో ని స్వర్ణ ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్ షాప్ లో యూరియా బస్తాకు అదనంగా 40 రూపాయలు వసూలు చేస్తుండడంతో ఇదేమిటి అని రైతులు నిలదీయగా మేము అంతే అమ్ముతాం ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకో పో అని రైతులతో దురుసుగా మాట్లాడుతున్న స్వర్ణ ఫర్టిలైజర్ యజమాని మా షాపు నందు యూరియా బుక్ చేయకూడదు అన్ని నిర్భయంగా చెప్పడం జరుగుతుంది. కావున అధికారులు స్పందించి అట్టి షాపుపై తగిన చర్యలు తీసుకోవాలని రైతు వల్లపు రమేష్ డిమాండ్ చేయడం. అమాయక ప్రజలతో ఆటలాడుతున్న ఫెర్టిలైజర్ షాప్ యజమానులకు అధిక ధరలకు అమ్మకుండా నోటీసులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు. వివరణ: వల్లపు రమేష్ ఫిర్యాదుతో స్థానిక మండల వ్యవసాయ అధికారి అనిషా రోహి స్వర్ణ ఫర్టిలైజర్ షాపులు సీజ్ చేయడం జరిగినదని తెలియజేశారు.



వర్షాకాలం దృష్ట్యా హైదరాబాద్ మహానగరం, జిల్లా, పట్టణ కేంద్రాల కాలనీల్లో ఇంకుడు గుంతల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించాలని లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు ఎం.దశరథ్ నాయక్ కోరారు. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు అవగాహన, చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్ బాగ్లో ఆయన మాట్లాడారు. భూభాగంలో నీటిశాతం పెరగాలంటే, భవిష్యత్తులో నీటి కష్టాలు రాకుండా ఉండాలంటే ఇంకుడు గుంతల నిర్మాణం అవశ్యమన్నారు. ఇంకుడు గుంతల్లో వర్షపు నీటిని ఒడిసిపట్టాలని భూమిలో నీటి శాతం పెంచవచ్చన్నారు. రైతులు పొలాల పక్కన, రోడ్లకు ఇరువైపుల అనువైన స్థలంలో ఇంకుడు గుంతలు చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతల ప్రయోజనాలను తెలియజేసి, వాటిని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి వేడుకొన్నారు.

# ఎన్నికల జాబితాల సమగ్ర నవీకరణకు సన్నాహాలు

## తుర్కయాంజల్‌లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 19:-
తుర్కయాంజల్: రాబోయే ఎన్నికల జాబితాల నవీకరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించే లక్ష్యంతో శుక్రవారం తుర్కయాంజల్‌లోని ఇండస్ వ్యాలీ స్కూల్‌లో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల ప్రక్రియలో కీలక బాధ్యతలు నిర్వహించే క్షేత్రస్థాయి సిబ్బంది మరియు వారి పర్యవేక్షకులకు విస్తృత స్థాయిలో మార్గనిర్దేశం చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న నిపుణులు ఎన్నికల నమోదుకు సంబంధించిన తాజా విధానాలు, ఓటరు వివరాల పరిశీలన, జాబితాల నవీకరణలో అనుసరించాల్సిన చర్యలు, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కార మార్గాలపై వివరంగా చర్చించారు.

అలాగే విధుల నిర్వహణలో ఖచ్చితత్వం, పారదర్శకత మరియు సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన సిబ్బంది తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించేలా పలు సూచనలు అందించగా, కార్యక్రమానికి హాజరైన అధికారులు ఎన్నికల వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ బి. సత్యనారాయణ రెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు బి.ఎం.కె. రమేష్, ఎస్. శ్రీనివాసులు, శిక్షణ నిపుణులు రాజిరెడ్డి, ఎస్.కె. జహీర్తో పాటు సంబంధిత అధికారులు, పర్యవేక్షకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల నేపథ్యంలో నేడు విద్యుత్ అంతరాయం-ఏఈ చక్రపాణి

( హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూన్19:)



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో మహేశ్వరం మండల విద్యుత్ అధికారి ఏఈ చక్రపాణి మాట్లాడుతూ...విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులను చేపట్టనున్న నేపథ్యంలో రేపు (శనివారం) పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మహేశ్వరం విద్యుత్ శాఖ ఏఈ చక్రపాణి తెలిపారు.ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు రావిర్యాల,కొంగర కుర్దు,వండర్ల,కళాజ్యోతి ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉండనుంది.అలాగే మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఓఆర్ఆర్ రావిర్యాల ఎగ్జిట్,కలెక్టర్ ఆఫీస్ రోడ్,గూగి విల్లాస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది.విద్యుత్ నిర్వహణ పనులను సజావుగా పూర్తి చేసేందుకు వినియోగదారులు సహకరించాలని ఏఈ చక్రపాణి కోరారు.

# విధి నిర్వహణలో ఉన్న అధికారులపై దౌర్జన్యానికి వ్యతిరేకంగా రెవెన్యూ సిబ్బంది ఆగ్రహం

## ప్రభుత్వ ఉద్యోగుల భద్రతకు భరోసా కల్పించాలని పోలీసులకు వినతి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 19:-
ప్రభుత్వ సేవల్లో భాగంగా తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్న సిబ్బందిపై చోటుచేసుకున్న అనుచిత ఘటనను ఖండిస్తూ రెవెన్యూ శాఖకు చెందిన ఉద్యోగులు శుక్రవారం ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. ఇటీవల అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో చోటుచేసుకున్న సంఘటనలో అధికారులతో అనుచితంగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా పలువురు రెవెన్యూ సిబ్బంది మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరవేసే క్రమంలో ఉద్యోగులు ఎదుర్కొనే ఇలాంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా సేవలో నిమగ్నమైన సిబ్బందిపై అనవసర ఒత్తిళ్లు, బెదిరింపులు లేదా దురుసు ప్రవర్తన చోటుచేసుకోవడం మంచిది కాదని అభిప్రాయపడ్డారు. వివిధ మండలాల నుంచి వచ్చిన ఉద్యోగులు సంఘీభావం ప్రకటిస్తూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అవసరమని కోరారు. విధి నిర్వహణలో ఉన్న అధికారుల గౌరవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అందిన వివరాల ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నామని, చట్ట ప్రకారం తగిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఉద్యోగులు ఐక్యంగా నిలిచి, ప్రజా



సేవల నిర్వహణకు ఆటంకం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధులను నిర్వర్తించే ప్రతి ఉద్యోగికి రక్షణ, గౌరవం కల్పించే వాతావరణం ఉండాలని వారు ఆకాంక్షించారు.

# కోలన్ గూడ నుండి వెలిమినేడు వరకు రోడ్డు వినతి పత్రం అందజేసిన రాచూరి కిరణ్

హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూన్ 19



తెలంగాణ ముద్దుబిడ్డ కేంద్ర మంత్రివర్యులు గంగాపురం కిషన్ రెడ్డి కందుకూరు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల కొరకై విచ్చేసిన సందర్భంగా, కేంద్ర మంత్రి స్వగ్రామం తిమ్మాపూర్ గ్రామంలో వారిని కలిసి కోలన్ గూడ గ్రామం నుండి వెలిమినేడు గ్రామం వరకు 5 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణం గురుంచి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. దానికి వారు సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో కోలన్ గూడ గ్రామ బీజేపీ పార్టీ బూత్ అధ్యక్షులు 4వ వార్డు సభ్యులు బండ జగన్, బీజేపీ పార్టీ గ్రామ అధ్యక్షులు రాసూరి కరణ్, 7వ వార్డు సభ్యులు బండ విజయలక్ష్మి, 8వ వార్డు సభ్యులు రాసూరి జ్యోతి, బీజేపీ సీనియర్ నాయకులు బండ శ్రీనివాస్,ఆదర్ల మహేందర్, గౌర బీరప్ప, వేల్పుల మహేందర్,రాసూరి శ్రీకాంత్, వేల్పుల సురేష్, బండ శ్రీను, గోరికెలా శ్రీశైలం, ఆదర్ల కృష్ణ, ఆదర్ల నరేష్, బత్తుల సాయిరెడ్డి,గౌర శ్రీను, రాసుల వేణు, రాసుల సాయికిరణ్. తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణలో విద్యా వ్యవస్థను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం

## -ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో అనేక కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు

## -బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ

తెలంగాణలో విద్యా వ్యవస్థను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తుంది అని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు.శుక్రవారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ.....ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు నేడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు అని ఆయన తెలిపారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో అనేక కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు అని ఆయన అన్నారు.విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలి అని ఆయన డిమాండ్ చేశారు.గురుకుల విద్యాసంస్థలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, మౌలిక సదుపాయాల కొరత, సిబ్బంది సమస్యలు, విద్యార్థుల భద్రత వంటి అంశాలను పట్టించుకోకుండా గురుకుల వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు.ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయ ప్రచారాన్ని పక్కనపెట్టి విద్యార్థుల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును



కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

# వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకి బెయిల్ మంజూరు



హైదరాబాద్ శివారు గండిపేటలో కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా, ఫేక్ జీవో కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడికి రంగారెడ్డి జిల్లా కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు మూడు రోజుల పాటు ఆయనను కస్టడీలోకి తీసుకుని విచారించారు. కస్టడీ ముగిసిన అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం బెయిల్ ఇస్తూ తీర్పునిచ్చింది.విచారణ సమయంలో, బ్రహ్మనాయుడు కస్టడీలో ఏ ప్రశ్నకు సరైన సమాధానాలు చెప్పలేదని, దర్యాప్తునకు ఆశించిన స్థాయిలో సహకరించలేదని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే, కస్టడీ గడువు ముగిసినందున ఆయన బెయిల్‌కు అర్హుడేనని బొల్లా న్యాయవాదులు వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం... ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. రూ. 20 వేల చొప్పున ఇద్దరు పూచీకత్తులు (ష్యూరిటీలు) సమర్పించాలని ఆదేశించింది. అలాగే, ప్రతి 15 రోజులకు ఒకసారి నార్సింగి పోలీస్ స్టేషన్‌లో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని, కేసు విచారణను లేదా సాక్షులను ఎలాంటి పరిస్థితుల్లోనూ ప్రభావితం చేయకూడదని కోర్టు స్పష్టమైన షరతులు విధించింది.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
20 శనివారం జూన్ 2026

## విద్యుత్ కార్మికుల సమస్యలపై ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబుకు నాయకుల వినతి.





నరసరావుపేట జూన్ 19

యునైటెడ్ ఎలక్ట్రిసిట్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సమస్యలపై శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుకు నాయకులు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ కార్మికులకు చెల్లించవలసిన జాతీయ పండుగలకు, ఇతర పండుగలకు సెలవులకు గాను చెల్లించవలసిన బకాయిలు, ప్రభుత్వం చెల్లించడం లేదని తమరి ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని నాయకులు కోరారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని తెనాలి, అమరావతి తదితర డివిజన్లో పని చేస్తున్న కార్మకులకు చెల్లించియున్నారు. పల్నాడు జిల్లా విద్యుత్ కార్మికులకు అదే విధంగా వర్తించే విధంగా చేయాలన్నారు. అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన ఫలితం లేకుండా పోతుందని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, జిల్లా విద్యుత్ అధికారులతో మాట్లాడి అర్హులైన విద్యుత్తు కార్మికులందరికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే అరవింద బాబును నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పలపాటి రంగయ్య, సిపిఐ ఏరియా కార్యదర్శి సిహెచ్ సత్యనారాయణ రాజు కార్యదర్శి ఎస్.కె చిన్న జాన్ సైదా గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్, యువజన నాయకులు బి. రాంబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ నియోజకవర్గం :-





వనమహోత్సవం మరియు ఎకో పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి స్వాగతం పలికిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి గారు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డి గారు. ఈ సందర్భంగా వనమహోత్సవం స్ఫూర్తిని ప్రతిబింబించేలా "హరిత వనానికి కొత్త నిర్వచనం మీరు ... చరితన చెరగని సంతకం మీ పేరు" అనే సందేశంతో రూపొందించిన ప్రత్యేక చిత్రపటాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి వారు అందజేశారు.

## తెలంగాణపై పవన్ కల్యాణ్ ఫోకస్.. మణికొండలో జనసేన కొత్త ఆఫీస్



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన అఖండ విజయం స్ఫూర్తితో జనసేన పార్టీ తెలంగాణలో తన కార్యకలాపాలను విస్తరించే దిశగా కీలక అడుగు వేసింది. పార్టీ అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం హైదరాబాద్‌లోని మణికొండలో జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించారు. మణికొండలోని మల్కం చెరువు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ కార్యాలయంలో తొలుత సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పవన్ కల్యాణ్ పార్టీ జెండాను ఆవిష్కరించి, కార్యాలయంలోకి ప్రవేశించారు. అక్కడ ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి చిత్రపటానికి ఆయన పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలతో ఆయన కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమానికి జనసేన శ్రేణులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అవసరమైతే ఒంటరిగానే బరిలోకి దిగుతామని పవన్ కల్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. పార్టీలోకి చేరికలను ప్రోత్సహించేందుకు వీలుగా త్వరలోనే ఒక ప్రత్యేక జాయినింగ్స్ కమిటీని కూడా నియమించనున్నారు.

## డ్రగ్స్ రహిత తెలంగాణకు విద్యార్థుల ప్రతిజ్ఞ.. ఎల్‌బీ స్టేడియంలో భారీ అవగాహన కార్యక్రమం

### మాదక ద్రవ్యాల నిర్మూలనకు యువత ముందుకు

### ముఖ్యమంత్రి వేలాది విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన గవర్నర్






హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 19:-

హైదరాబాద్: మాదక ద్రవ్యాల మహమ్మారిని నిర్మూలించి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా విద్యార్థినీ, విద్యార్థులతో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా విద్యార్థులు "మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వాములమవుతామని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తామని, తమతో పాటు ఇతరులు కూడా మాదక ద్రవ్యాల బారిన పడకుండా కృషి చేస్తామని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంకల్పానికి అండగా నిలుస్తామని" ప్రతిజ్ఞ చేశారు.

మాదక ద్రవ్యాల వల్ల యువత భవిష్యత్తు దెబ్బతినకుండా అవగాహన పెంచడం, విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనలో యువత పాత్ర కీలకమని, సమాజం మొత్తం కలిసి పనిచేస్తేనే మాదక ద్రవ్యాల సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని కార్యక్రమంలో పేర్కొన్నారు.

విద్యార్థుల్లో చైతన్యం నింపుతూ, మాదక ద్రవ్యాల వ్యతిరేక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ కార్యక్రమం సాగింది. డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు విద్యార్థులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

## ముందస్తు నిర్ధారణతో సికిల్ సెల్ అనీమియాకు చెక్ డీఎంహెచ్‌వో డా. స్వర్ణ కుమారి

### సికిల్ సెల్ అనీమియా నివారణకు ప్రజల్లో చైతన్యం అవసరం బాలాపూర్‌లో అవగాహన సదస్సు






హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 19:-

రంగారెడ్డి జిల్లా: జాతీయ సికిల్ సెల్ అనీమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌వో) డా. స్వర్ణ కుమారి ముఖ్య అతిథిగా హాజరై సికిల్ సెల్ అనీమియా వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపు మరియు చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. స్వర్ణ కుమారి మాట్లాడుతూ, సికిల్ సెల్ అనీమియా అనేది వారసత్వంగా సంక్రమించే రక్త సంబంధిత వ్యాధి అని తెలిపారు. వ్యాధిని ముందుగానే గుర్తించి తగిన వైద్య సేవలు పొందితే దాని ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ప్రజలు ఆరోగ్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవడంతో పాటు ఆరోగ్య శాఖ సూచిస్తున్న జాగ్రత్తలను పాటించాలని సూచించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. బాలమణి మాట్లాడుతూ, సికిల్ సెల్ అనీమియా లక్షణాలు, అందుబాటులో ఉన్న చికిత్సలు మరియు ఆరోగ్య శాఖ ద్వారా అందిస్తున్న సేవల గురించి వివరించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న స్క్రీనింగ్ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా. రాధిక, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన పెంపొందించేందుకు పలు సూచనలు, ఆరోగ్య సందేశాలు అందించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.

## గాంధీ భవన్‌లో మిన్నంటిన రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

### – హాజరైన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, నేషనల్ ఓబీసీ ఫోరం చైర్మన్ ఆళ్ల రామకృష్ణ



నాంపల్లి (హైదరాబాద్), జూన్ 19:

ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నాంపల్లిలోని గాంధీ భవన్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షులు (టీపీసీసీ చీఫ్) శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో, నేషనల్ ఓబీసీ ఇంటెలెక్చ్యువల్ ఫోరం చైర్మన్ శ్రీ ఆళ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణుల సమక్షంలో నేతలు భారీ కేక్‌ను కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా *»Hope of The Nation రాహుల్ గాంధీ'లి అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

చచచ దేశాన్ని కాపాడుతున్నది రాహుల్ గాంధీ ఆలోచనలే: ఆళ్ల రామకృష్ణ

కార్యక్రమంలో నేషనల్ ఓబీసీ ఇంటెలెక్చ్యువల్ ఫోరం చైర్మన్ శ్రీ ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మత విద్వేషాలు, అప్రజాస్వామిక పాలన, అవినీతి, విపరీతమైన ధరల పెరుగుదలతో దేశాన్ని సర్వనాశనం చేస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని కాపాడుకోవడానికి, భారతీయులంతా ఒక్కటే అనే భావనను నింపడానికి రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ జోడో యాత్ర' ఒక చారిత్రాత్మక ఘట్టమని కొనియాడారు. తెలంగాణలో కులగణనకు శ్రీకారం చుట్టడం ద్వారా దేశవ్యాప్తంగా బలహీన వర్గాలకు, ముఖ్యంగా ఓబీసీలకు సామాజిక న్యాయం చేకూర్చడమే రాహుల్ గాంధీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

చచచ సామాజిక న్యాయమే ధ్యేయం: వక్తలు

దేశంలో రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, సమానత్వం కోసం రాహుల్ గాంధీ నిరంతరం చేస్తున్న పోరాటం ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష అని పలువురు వక్తలు కొనియాడారు. యువతలో రాజకీయ చైతన్యాన్ని రగిలించడంలో ఆయన పాత్ర సాటిలేనిదన్నారు. రాహుల్ గాంధీ పూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, దేశ ప్రజల సేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాంగ్రెస్ నాయకులు ఆకాంక్షించారు.

ఈ వేడుకల్లో సీనియర్ నాయకులు వి. హనుమంతరావు, పుస్తక రచయిత దొమ్మాట వెంకటేష్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోలగాని వెంకీ గౌడ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని సందడి చేశారు.

## ఫిన్‌లాండ్‌లో తెలుగు విద్యార్థి అదృశ్యం.. కేంద్రానికి హైకోర్టు నోటీసులు



హైదరాబాద్‌కు చెందిన ఓ విద్యార్థి ఫిన్‌లాండ్‌లో గత 45 రోజులుగా కనిపించకుండా పోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. హయత్‌నగర్‌కు చెందిన గుజ్జ మణిదీప్ రెడ్డి (18) అదృశ్యంపై అతని తల్లిదండ్రులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, విద్యార్థి ఆచూకీని కనిపెట్టేందుకు తీసుకుంటున్న చర్యలపై నివేదిక సమర్పించాలని కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. మణిదీప్ రెడ్డి 2025 మార్చిలో ఫిన్‌లాండ్‌లోని లాహ్టి నగరంలో ఉన్న లూట్ యూనివర్సిటీలో బీటెక్ కోర్సులో చేరాడు. మే 5వ తేదీన అతడు తన తల్లితో చివరిసారిగా ఫోన్‌లో మాట్లాడాడు. తాను ఒక బేకరీలో ఉన్నానని, రూంకి తిరిగి వెళతానని చెబుతూనే, డబ్బులు కావాలని కోరాడు. అయితే, ఆ తర్వాత నుంచి మణిదీప్ ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. మణిదీప్ ఆచూకీ కోసం అతడి స్నేహితులు, రూమ్‌మేట్స్, యూనివర్సిటీ అధికారులను సంప్రదించినా ఎటువంటి ఫలితం లభించలేదు. హెల్సింకిలోని భారత రాయబార కార్యాలయం, స్థానిక అధికారులు స్పందించడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ మణిదీప్ తల్లిదండ్రులు గుజ్జ మరనాత, ముత్యం రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జూన్ 18న జస్టిస్ బి. విజయ్‌సేన్ రెడ్డి విచారణ జరిపారు. కేంద్ర ప్రభుత్వం, ఫిన్‌లాండ్‌లోని భారత రాయబార కార్యాలయం, తెలంగాణ పోలీసులకు నోటీసులు జారీ చేస్తూ, కేసు దర్యాప్తు పురోగతిపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం తదుపరి విచారణను జూన్ 24కు వాయిదా వేశారు. ఫిన్‌లాండ్‌లో ఇప్పటికే మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. తమ కుమారుడిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
20 శనివారం జూన్ 2026

# శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో గోపూజ...





స్థానిక గవరపాలెం శతకం పట్టు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయములో నవమి వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కే హరినారాయణ, కే శివకేశవ, ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ నవమి వార్షికోత్సవ వేడుకలు భాగంగా గురువారం ఆలయ శాశ్వత చైర్మన్, నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు భాగ్యలక్ష్మి దంపతుల సౌజన్యంతో అమ్మవారి ఆలయం వద్ద హోమం, గోపూజ ఘనంగా నిర్వహించారు,ఈ హోమంలో పాల్గొన్న దంపతులు. కాండ్రేగుల వెంకట సాంబశివరావు లలిత, పిళ్లా తారకేష్ రూపాదేవి, మద్దాల నాగ శివ ఉమామహేశ్వరి, యల్లపు మాధవరావు మహాలక్ష్మి దంపతులు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమర శెట్టి వరాహ నూకరాజు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, శ్రీ గౌరీపరమేశ్వరుల కమిటీ సభ్యులు, శ్రీ మరిదిమాంబ కమిటీ సభ్యులు , శ్రీ గౌరీ పరమేశ్వరి ప్రజాటెంట్ హౌస్,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ నూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు...





ఉత్తరాంధ్ర ఇలవేల్పు రాష్ట్ర పండుగ గుర్తింపు పొందిన అనకాపల్లి గవరపాలెం వెలసిన శ్రీ నూకాంబిక అమ్మవారికి భక్తులు ద్వారా హుండి ద్వారా మొత్తం 50రోజులలో భక్తులు సమర్పించిన ముడుపులు, మొక్కుబడులను గురువారం మండపములో హుండీ లెక్కింపు జరిగినది. సదరు లెక్కింపులో నగదుగా రూ 85, 81,185/- లు, బంగారం 20 గ్రాములు 100 మిల్లీగ్రాములు వ వెండి 800 గ్రాములు వచ్చినది.ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, జిల్లా సహాయ కమిషనర్ కేఎల్ సుధారాణి, దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ వసంతరావు

ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్,దాడి రవికుమార్
పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు,కాండ్రేగుల రాజారావు ,మజ్జి జానకి శ్రీనివాసరావు,కొడుకుల శ్రీకాంత్,వడ్డాది మంగ,కోనేటి సూర్యలక్ష్మి పైడ్రాజు,
యర్రవరపు సంతోషి కుమారి నాగేష్,
మరియు హుండీల లెక్కింపునకు దేవస్థానము సిబ్బంది, పూజారులు, శ్రీవారిసేవ సభ్యులతోను, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, గవరపాలెం బ్రాంచ్ సిబ్బంది, అనకాపల్లి టౌన్ పోలీసు వారు మరియు భక్తులు పాల్గొన్నారు.

# గంజాయి కేసులో నిందితుడికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష



"అనకాపల్లి జిల్లా, కె.కోటపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి కేసులో గౌరవ IX అదనపు జిల్లా & సెషన్స్ న్యాయమూర్తి ఎం.హరి నారాయణ కీలక తీర్పు వెలువరించారు.
నిందితుడు కార్తీక్ వద్ద నుంచి గతంలో 04 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగింది. కోర్టులో నిందితుడు తనపై మోపబడిన అభియోగాలను స్వచ్ఛందంగా అంగీకరించాడు.
శిక్ష కింద నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ, 02 (రెండు) సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు రూ.1,000/- జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఒక వారం సాధారణ శిక్ష అనుభవించాలని న్యాయస్థానం ఆదేశించింది.నిందితుడు 27.03.2024 నుండి 18.06.2026 వరకు రిమాండ్‌లో గడిపిన కాలాన్ని సెక్షన్ 428 ప్రకారం శిక్షా కాలంలో మినహాయించనున్నారు
ఊా2 నిందితుడు: ఈ కేసులోని రెండవ నిందితుడు (ఊా2) ముచ్చల శ్రీను పై విచారణ ప్రస్తుతం కోర్టులో కొనసాగుతోంది.
ఈ కేసును కె.కోటపాడు ఎస్సై రాజన ధనుంజయ్ అత్యంత సమగ్రంగా దర్యాప్తు చేసి, కోర్టులో పక్కా సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టారు. ప్రభుత్వ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చీపురుపల్లి సూర్యప్రకాశరావు బలమైన వాదనలు వినిపించి నిందితుడికి శిక్ష పడేలా చేశారు.మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేసే ఒక సామాజిక రుగ్మత. గంజాయి వంటి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలు లేదా వినియోగానికి పాల్పడే వారిపై అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తుంది. యువత వీటికి దూరంగా ఉండాలి. జిల్లాలో ఎక్కడైనా మాదక ద్రవ్యాల గురించిన సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించి, సమాజ రక్షణలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేస్తున్నాము."

# సైబర్ నేరాల నియంత్రణకు బ్యాంకులు, పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేయాలి
## జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా





జిల్లా వ్యాప్తంగా పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టడం, ప్రజల ఆర్థిక భద్రతను కాపాడటమే ధ్యేయంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ముఖ్యమైన సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని జాతీయ, ప్రైవేట్ బ్యాంకుల మేనేజర్లు మరియు ప్రతినిధులు హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బ్యాంక్ అధికారులను ఉద్దేశించి పలు కీలక సూచనలు చేశారు.
సమావేశంలోని ముఖ్యమైన అంశాలు:
తక్షణమే నగదు ఫ్రీజింగ్: సైబర్ నేరగాళ్ల బారిన పడి బాధితులు కోల్పోయిన నగదును లీగల్ ప్రాసెస్ ద్వారా తక్షణమే ఫ్రీజ్ చేయడంలో, బాధితులకు నగదును విడుదల చేయడంలో బ్యాంకులు చొరవ చూపాలి. నేరంతో సంబంధంలేని ఎకౌంట్లోను డీఫ్రీజ్ చేయాలి. బాధితులకు వారి సొమ్ము తిరిగి అందేలా పోలీస్ శాఖ - బ్యాంకుల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలి.
ఏటీఎంల భద్రత - సెక్యూరిటీ గార్డులు: జిల్లాలోని అన్ని బ్యాంక్ మరియు ఏటీఎం కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలి.
ప్రతి ఏటీఎం వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీ గార్డులు ఉండేలా చర్యలు తీసుకోవాలి.సీసీటీవీ కెమెరాల నిఘా: బ్యాంకులు మరియు ఏటీఎం పరిసరాల్లో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలను సెంట్రలైజ్ చేయాలి, అవి నిరంతరం పనిచేసేలా (వర్కింగ్ కండిషన్‌లో) చూసుకోవాలి.
అనుమానాస్పద ట్రాన్సాక్షన్లపై నిఘా: బ్యాంక్ ఖాతాల్లో జరిగే అనుమానాస్పద నగదు బదిలీలు మరియు సైబర్ నేరగాళ్లు వాడే మ్యూల్ అకౌంట్లపై ప్రత్యేక నిఘా ఉంచాలి.
అసాధారణ లావాదేవీలు గమనించిన వెంటనే పోలీస్ శాఖకు సమాచారం అందించాలి.ప్రజల్లో అవగాహన:
సైబర్ మోసాలపై ఖాతాదారులకు, ప్రజలకు బ్యాంకుల ద్వారా విస్తృత అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉంది.
"సైబర్ క్రైమ్ బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడంలో బ్యాంక్ అధికారుల పాత్ర అత్యంత కీలకం. సాంకేతికతను వాడుకుంటూ బ్యాంకులు, పోలీస్ యంత్రాంగం కలిసికట్టుగా పనిచేసినప్పుడే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయగలం.
ఈ అత్యవసర సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు, అనకాపల్లి సబ్ డివిజన్ అదనపు ఎస్పీ ఎం.శ్రావణి, ఎస్.బి డీఎస్పీ జీ.ఆర్.ఆర్.మోహన్, సోషల్ మీడియా/సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ సతీష్, ఐ.టీ కోర్ ఎస్సై సురేష్ బాబు మరియు జిల్లా పరిధిలోని వివిధ జాతీయ, ప్రైవేట్ బ్యాంకుల మేనేజర్లు, ముఖ్య ప్రతినిధులు మరియు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# గొడ్డల పార్టీ కోసం అమర్నాథ్ దిగజారుడు రాజకీయాలు
## మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్



హోం శాఖ మంత్రివర్యులు వంగలపూడి అనిత పై అనుచిత వ్యాఖ్యలు చేసి, వ్యక్తిగత దూషణలకు పాల్పడిన మాజీ మంత్రి వైకాపా నాయకుడు గుడివాడ అమర్నాథ్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు ఈరోజు తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అమర్నాథ్ ను డిమాండ్ చేశారు. వైసీపీ అధినేత జగన్ రెడ్డి మహిళల పట్ల అవమానకరం మాట్లాడే వాళ్ళని అదుపు చేసి హుందాగా వ్యవహరించేలా చూడవలసిన గొడ్డల పార్టీ అధ్యక్షుడు, వారిని ప్రోత్సహించడశీ, మందలించవలసిన జగన్ రెడ్డి వారిని ప్రేరేపించడం చూస్తుంటే కులాల కుంపట్లో రేగిలేలా రాజకీయాలు చేయడం తగదని నాగ జగదీష్ జగన్ రెడ్డికి హితువు పలికారు. రాష్ట్రవ్యాప్తంగా అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలపై ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, మహిళలు ఖండించినప్పటికీ, అమర్నాథ్ ఎటువంటి మార్పు లేదని తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడే ఉన్నానని చెప్పడం మహిళల పట్ల అతనికి ఉన్న అభిప్రాయాన్ని తేటతెల్లం చేసి చౌకబార్ రాజకీయాలు చేయడం ద్వారా రాజకీయ విలువలు దిగజారుస్తున్న అమర్నాథ్, తన తండ్రి గుడివాడ గురునాధరావు రాజకీయ చరిత్రలో ఇటువంటి వ్యాఖ్యలు ఏనాడో చేయలేదని, కేవలం సిద్ధాంతపరంగా విమర్శలు చేశారే తప్ప అమర్నాథ్ లాగా దిగజారుడు రాజకీయాలు చేయలేదని నాగ జగదీష్ అన్నారు. సమాజంలో ఒక మహిళ, హోం శాఖ మంత్రిగా ప్రజలు భద్రత కోసం, గంజాయి, సంఘ వ్యతిరేక శక్తులు అదుపు చేయడంలో రికార్డులు సృష్టిస్తున్న అనిత పై కావాలనే తప్పుడు ప్రచారం వ్యక్తి గత దూషణ చేయడం, రాజకీయ విమర్శలు విధానాల పరంగా ఉండాలే తప్ప వ్యక్తిగత దూషణకు దిగడం వైసిపికే చెల్లిందని నాగ జగదీష్ అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పెరిగిన క్రైమ్ రేట్ ఈ రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో క్రైమ్ రేట్ 14.1 శాతం తగ్గిందని, దీనికి నిరంతరం కృషి చేసిన అనితను అభినందించవలసింది పోయి అనిత పై విమర్శలు చేసి సమర్ధించుకోవడం గుడివాడ అమర్నాథ్ కే చెల్లిందని నాగ జగదీష్ మండిపడ్డారు. విలేకరుల సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కాండ్రేగుల సత్యనారాయణ కాండ్రేగుల రవీంద్ర మల్ల గణేష్ కాండ్రేగుల గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల జీతాలు చెల్లించాలి....



జిల్లాలో పంచాయతీ కార్మికుల బకాయి జీతాలు చెల్లించాలని జిల్లా పంచాయతీ అధికారికి గురువారం గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు మొలకలపల్లి అప్పలరాజు కార్యవర్గ సభ్యులు పల్లె వేల చిన్నారావు వినతి పత్రం సమర్పించారు. అనకాపల్లి జిల్లాలో అనేక పంచాయతీల్లో మూడు నెలల నుండి ఐదు నెలల వరకు జీతాలు రాక పారిశుద్ధ్య కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు, వీరికి తక్షణమే జీతాలు చెల్లించాలని. ఇప్పటికే మాకవరపాలెం మండలంలో పంచాయతీల కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం గ్రామపంచాయతీ గ్రీన్ అంబాసిడర్లకు హెల్త్ అలవెన్స్ కోసం జీతంతో పాటు నెలకు రూ.4000/- రూపాయలు ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చింది. దీనిని నేటికీ అనేక పంచాయతీలు అమలు చేయడం లేదు. పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్ గ్యాస్, కరెంటు, ధరలు, విద్యా, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో చాలీచాలని జీతాలతో గ్రామపంచాయతీ కార్మికులు ఆర్థిక ఇబ్బంది పడుతున్నారు. కనీస వేతనాలు, హెల్త్ అలవెన్స్ అమలు కోసం, బకాయి జీతాలు చెల్లింపు కోసం తగు చర్యలు తీసుకోవాలనీ కోరారు.

# గొర్రెల పెంపకం దారులు పై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి.....



స్థానిక దొడ్డి రామునాయుడు భవన్ లో జరిగిన సమావేశంలో ప్రకాశం జిల్లా ఈదముడిలో చినగంజాం మండలం కొత్త గొల్లపాలెం సంబంధించిన గొర్రెల పెంపకం దారులపై గ్రామంలోని పెత్తందారులు దాడి చేసి కులం పేరుతో తిట్టి గాయపరచడాన్ని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు మేకలు పెంపకం దారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్, ఉమ్మిడి విశాఖపట్నం జిల్లా గొర్రెలు పెంపకం దారుల సహకారసంఘం వైస్ చైర్మన్ సబ్బి శ్రీనువాసరావు, జిల్లా కార్యదర్శి గోకాడ దేముడు నాయుడు తీవ్రంగా ఖండించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులు కేసు నమోదు చేసిన దోసులను అరెస్టు చేయడం లేదని, పైగా దాడికి గురైన వారి మీదనే కేసు నమోదు చేయడం జరిగిందని పోలేసుల చర్యలు పక్షపాతంగా ఉన్నాయన్నారు. . ఇది చాలా అన్యాయమైన విషయం కనుక దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, అక్రమంగా పెట్టిన కౌంటర్ కేసును ఎత్తివేయాలని, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం వలె చట్టం తీసుకొచ్చి గొర్రెల మేకలు పెంపకం దారులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇంత జరిగిన ప్రభుత్వంతో దోసులుపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చోసనీయమన్నారు. ఇప్పటికైన తగు తీసుకోవాలని లేదంటే దీనిపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# ఎంఈఓ ను సత్కరించిన ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు




అనకాపల్లి మండలం రెండో విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన బి కే ఎస్ విశ్వేశ్వరరావు (కాశీ ) ని ఉపాధ్యాయ సంఘాల నేతలు గురువారం సత్కరించారు. అనకాపల్లి మండల విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏ.పీ.టీ.ఎఫ్. ఉపాధ్యాయ సంఘం మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు కొణతాల గణేష్, సీ.హెచ్. కిరీటి, మణికుమార్, సత్యనారాయణ, డేవిడ్, శ్యామ్, ప్రసాద్, లక్ష్మి, రాందేవ్, మోహన్, నాయుడు తదితరులు పాల్గొన్నారు. అనకాపల్లి మండలం పట్టణ పరిధిలో విద్యాభివృద్ధికి అందరూ ఐక్యంగా కలిసి పని చేద్దామని ఎంఈఓ వీరిని కోరారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# ధోతీలో పూజా హెగ్డే లేటెస్ట్ లుక్!



అవకాశం లభించాలే కానీ తనను తాను ప్రూవ్ చేసుకోవడానికి ఎప్పుడూ ముందుండే బుట్టబొమ్మ అలియాస్ పూజా హెగ్డే గత కొంతకాలంగా సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తోంది. ముఖ్యంగా ఇటీవల కాలంలో ఈమె నటించిన ప్రతి సినిమా కూడా దాదాపు డిజాస్టర్ గానే మిగలడంతో అమ్మడిపై ఐరన్ లెగ్ అనే ముద్ర కూడా పడింది. ముఖ్యంగా ఆచార్య, రెట్రో , ఎఫ్ 3, బీస్ట్ , సర్కస్, దేవా ఇలా పలు చిత్రాలు చేసింది కానీ ఏవి కూడా ఈమెకు విజయాన్ని అందించలేదు. ఇక గత ఏడాది కూలీ సినిమాలో మోనిక అనే స్పెషల్ సాంగ్ లో అలరించి ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో పూజా హెగ్డే సందడి.. అయితే హీరోయిన్ గా మాత్రం ఈమెకు అవకాశాలు తలుపు తట్టలేదని చెప్పాలి. దీనికి తోడు ఇటీవల హై జవానీతో ఇష్క్ హోనా హై అనే సినిమాలో నటించింది. ఈ సినిమా కూడా అమ్మడి ఇమేజ్ ను పెంచలేకపోయింది. ప్రస్తుతం కొన్ని ప్రాజెక్టుల్లో బిజీగా ఉన్న ఈమె.. మరొకవైపు తన లేటెస్ట్ ట్రెండింగ్ అవుట్ ఫిట్ తో సోషల్ మీడియాలో సందడి చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ మేరకు తాజాగా మరో ట్రెండీ అవుట్ ఫిట్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. స్టైలిష్ లుక్ లో పూజ హొయలు.. ది లిటిల్ బ్లాక్ బో డిజైనర్ లేబుల్ కి సంబంధించిన రిలాక్స్ అండ్ క్రీమ్ పెప్లమ్, ధోతీ సెట్ ధరించి తన స్టైలిష్ లుక్కుతో అభిమానుల దృష్టిని ఆకట్టుకుంది. ముఖ్యంగా ఇండో వెస్ట్రన్ నేపథ్యంలో డిజైన్ చేసిన ఈ ధోతీ పై భాగంలో లేస్ ను పోలి ఉండేలా డోరీ దారం సహాయంతో చేతితో ఎంబ్రాయిడరీ చేసిన టాప్ ను ఆమె ధరించింది. దీనిపైన గోల్డెన్ కలర్ దారంతో జర్దోసి గులాబీలు అలాగే టీ స్టాండ్ ముత్యాలతో మరింత అందంగా డిజైన్ చేశారు. ఇక దీనికి సరిపోయే బాటమ్ డ్రేప్ ధోతీ సిల్హౌట్ తో స్టైల్ చేయబడిన ఈ కో – ఆర్డ్ సెట్ ఈమె అందాన్ని రెట్టింపు చేసింది. మొత్తానికి అయితే క్రీమ్ కలర్ ధోతీ సెట్ ఫ్యాషన్ లవర్స్ ను విపరీతంగా అలరిస్తోంది. పూజా హెగ్డే ధరించిన ఈ సెట్ ధర సుమారుగా రూ.58 వేలకు పైమాటే. ముఖ్యంగా ఈ డ్రెస్ ను ప్రత్యేకించి ముంబైలోని కళాకారులు చేతితో తయారుచేస్తారు. కాబట్టి ఈ ధోతీ సెట్ డెలివరీకి సాధారణంగా ఆరు నుండి 8 వారాల సమయం పడుతున్నట్లు సమాచారం. ఏదేమైనా ట్రెండీ అవుట్ ఫిట్ లో ఈమె షేర్ చేసిన ఈ లేటెస్ట్ ఫోటోషూట్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. అమ్మడి ఆశలన్నీ వాటి పైనే.. పూజా హెగ్డే తదుపరి సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం రాఘవ లారెన్స్ హారర్ కామెడీ మూవీ కాంచన ఫ్రాంచైజీలో భాగంగా కాంచన 4 లో నటిస్తోంది. అలాగే దుల్కర్ సల్మాన్ తో తెలుగులో డీక్యూ41 పేరిట ఒక సినిమా చేస్తోంది ఈ ముద్దుగుమ్మ . ఈ రెండు చిత్రాలతో పాటు తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ దళపతి చివరిగా నటించిన జననాయగన్ సినిమాలో కూడా నటించింది. ఈ సినిమా ఇంకా విడుదలకు నోచుకోలేదు. మరి ఈ చిత్రాలతో పూజ హెగ్డే మళ్లీ తనను తాను నిరూపించుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.

## తినాలని ఉన్నా తినలేని స్థితిని అనుభవించా: సమంత



సెలబ్రిటీల శారీరక ఆకృతి, బరువుకు సంబంధించి సోషల్ మీడియాలో నిరంతరం సాగే చర్చలపై ప్రముఖ కథానాయిక సమంత తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా తను సన్నబడటంపై నెటిజన్లు చేస్తున్న కామెంట్లకు ఆమె ఘాటుగా సమాధానమిచ్చారు. తాను కావాలని ఎలాంటి డైటింగ్ చేయలేదని, తీవ్రమైన 'మయోసైటిస్' (కండరాల వాపు వ్యాధి) బారిన పడటం వల్లే తన బరువు తగ్గాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ఎదుటివారి జీవితంలో ఏం జరుగుతుందో తెలుసుకోకుండా సులభంగా విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు.

ఆహార నియమాలపై స్పష్టత

తన తాజా ఇంటర్వ్యూలో సమంత మాట్లాడుతూ.. "గతంతో పోలిస్తే ఇప్పుడు నా ఆరోగ్యం కుదుటపడింది. కావాల్సిన ఆహారాన్ని తీసుకోగలుగుతున్నాను. అయితే, అతిగా తింటే మయోసైటిస్‌పై ప్రభావం పడుతుందన్న వైద్యుల సూచన మేరకు ప్రస్తుతం మితంగానే తింటున్నాను. తీవ్ర అనారోగ్య పరిస్థితుల కారణంగా నాకు తినాలని ఉన్నా తినలేని నిస్సహాయ స్థితిని అనుభవించాను. అంతే తప్ప, అందం కోసం డైటింగ్ చేసి బరువు తగ్గలేదు" అని చెప్పారు.

తన పెంపుడు పిల్లికి 'జెలాటో' (ఒక రకమైన ఐస్‌క్రీమ్) అని పేరు పెట్టడం వెనుక ఉన్న కారణాన్ని సామ్ వివరించారు. మయోసైటిస్ చికిత్సలో భాగంగా దాదాపు రెండేళ్ల పాటు ఎలాంటి ఉప్పు, కారం లేని పరిమిత ఆహారాన్ని మాత్రమే తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఆ కఠినమైన రోజుల్లో కోలుకున్న తర్వాత వైద్యులు మొదటిసారిగా 'చక్కెర లేని జెలాటో ఐస్‌క్రీమ్' తినడానికి అనుమతించారని, ఆ జ్ఞాపకార్థమే తన పిల్లికి ఆ పేరు పెట్టినట్లు తెలిపారు.

ఇదిలా ఉండగా, సమంత ప్రధాన పాత్రలో నటించిన లేడీ ఓరియెంటెడ్ చిత్రం 'మా ఇంటి బంగారం' నేడు ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది.

## బ్లాక్ అవుట్‌ఫిట్‌లో స్టైలిష్ కమ్‌బ్యాక్ ఇచ్చిన మోనాల్!



గుజరాతీ భామ మోనాల్ గజ్జర్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. అల్లరి నరేష్ 'సుడిగాడు' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి, ఆ తర్వాత 'బిగ్‌బాస్ తెలుగు సీజన్ 4'తో తెలుగు రాష్ట్రాల్లో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది ఈ భామ సాంప్రదాయ చీరకట్టులో దేవలోక రంభలా కనిపించే మోనాల్, అటు మోడరన్ డ్రెస్సుల్లోనూ తన గ్లామర్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తుంటుంది. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఆల్-బ్లాక్ మోడరన్ అవుట్‌ఫిట్ పిక్స్, దానికి పెట్టిన ఒక పవర్‌ఫుల్ క్యాప్షన్ ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి. ఆ విశేషాలు చూద్దాం.. ఆల్-బ్లాక్ డ్రెస్‌లో మోనాల్ మెరుపులు: తాజా ఫొటోషూట్‌లో మోనాల్ గజ్జర్ స్టైలిష్ అండ్ మోడరన్ ఆల్-బ్లాక్ కో-ఆర్డ్ సెట్‌లో మెరిసిపోయింది. డీప్ ప్లంగింగ్ వీ-నెక్లైన్, నడుము భాగంలో కటౌట్ డిజైన్, కింద ఫ్లేర్డ్ రఫుల్డ్ పెప్లమ్ హెమ్‌తో ఉన్న స్లీవ్‌లెస్ టాప్ ఆమెకు పర్ఫెక్ట్ లుక్ ఇచ్చింది. ఇక దీనికి మ్యాచింగ్‌గా హై-వైస్టెడ్, ఫ్లోవీ వైడ్-లెగ్ బ్లాక్ ట్రౌజర్స్ ధరించి తన టాప్ స్టైలింగ్‌ను మరింత బ్యాలెన్స్ చేసింది. ఈ మోడరన్ దుస్తుల్లో మోనాల్ గ్లామర్ నెక్ట్స్ లెవెల్‌లో ఉందంటున్నారు ఫ్యాన్స్. ఈ స్టైలిష్ అవుట్‌ఫిట్‌కు తగ్గట్టుగా మోనాల్ సింపుల్, మినిమల్ యాక్సెసరీస్‌తో మెరిసింది. ఇక చేతికి ఒక మెటాలిక్ వాచ్, స్టైలిష్ బ్రాస్లెట్ మరియు వేలికి ఒక పెద్ద కాక్టెయిల్ రింగ్ పెట్టుకుని తన లుక్‌కు మరింత రాయల్ టచ్ ఇచ్చింది. ఇక ఎప్పటిలాగానే తన సహజమైన చిరునవ్వు, ఆకర్షణీయమైన కళ్ళు మరియు అదిరిపోయే పోజులతో కెమెరాకు చిక్కి ఫ్యాన్స్ గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. ఈ అదిరిపోయే ఫొటోలతో పాటు మోనాల్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన క్యాప్షన్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. "గ్లో-అప్ అంటే అందంగా మారడం నా గోల్ కాదు.. కమ్‌బ్యాక్ ఇవ్వడమే నా అసలు లక్ష్యం" అంటూ ఒక పవర్‌ఫుల్ లైన్ రాసుకొచ్చింది. ఈ క్యాప్షన్ చూసిన నెటిజన్లు, మోనాల్ సరికొత్త ప్రాజెక్ట్‌లతో ఇండస్ట్రీలోకి గట్టి కమ్‌బ్యాక్ ఇవ్వడానికి రెడీ అయిందని కామెంట్స్ చేస్తున్నారు. సాధారణంగానే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మోనాల్, ఈ బ్లాక్ డ్రెస్ ఫొటోషూట్‌తో ఇంటర్నెట్‌కు ఒక్కసారిగా హీట్ పెంచేసింది. "బ్లాక్ కలర్ డ్రెస్‌లో మోనాల్ సూపర్బ్, అదరగొట్టేసావ్" అంటూ ఫ్యాన్స్ లైకులు, కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. మరి ఈ రేంజ్ గ్లో-అప్‌తో, హాట్ కమ్‌బ్యాక్ క్యాప్షన్‌తో హల్‌చల్ చేస్తున్న ఈ గుజరాతీ బ్యూటీ రాబోయే రోజుల్లో తెలుగు స్క్రీన్‌పై ఎలాంటి క్రేజీ ప్రాజెక్ట్స్‌తో సందడి చేయబోతుందో చూడాలి.

## తొలిసారి అరబిక్ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం.. విడుదలైన 'బాబ్' సౌండ్‌ట్రాక్




ఆస్కార్ విజేత, విశ్వవిఖ్యాత సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ తన సంగీత ప్రస్థానంలో మరో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. ఆయన తొలిసారిగా ఒక అరబిక్ చిత్రానికి సంగీతం అందించారు. ప్రముఖ దర్శకురాలు నైలా అల్ ఖాజా రూపొందించిన సైకలాజికల్ ఫాంటసీ-థ్రిల్లర్ 'బాబ్' కోసం రెహమాన్ స్వరపరిచిన ఒరిజినల్ సౌండ్‌ట్రాక్ శుక్రవారం విడుదలైంది. ఈ ఆల్బమ్‌లో మొత్తం 10 పాటలు ఉన్నాయి. రెహమాన్‌కు చెందిన కేఎమ్ మ్యూజిక్ లేబుల్‌పై విడుదలైన ఈ సౌండ్‌ట్రాక్‌ను డివో సంస్థ ప్రపంచవ్యాప్తంగా పంపిణీ చేస్తోంది. అన్ని ప్రధాన మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలో ఇది ప్రస్తుతం అందుబాటులో ఉంది. ఈ ప్రాజెక్ట్ గురించి రెహమాన్ మాట్లాడుతూ.. "బాబ్' చిత్రంలోని భావోద్వేగభరితమైన కథ, దర్శకురాలు నైలా సృష్టించిన విలక్షణమైన ప్రపంచం నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సినిమాకు తగ్గట్టుగా ప్రామాణికమైన సంగీతాన్ని అందించేందుకు కొత్త శబ్దాలను అన్వేషించాను. అరబిక్ సినిమాల్లోకి ఇది నాకు ఒక అర్థవంతమైన అడుగు" అని వివరించారు. 'బాబ్' చిత్రంలో వాహిదా అనే యువతి, తన కవల సోదరి మరణం వెనుక ఉన్న నిజాన్ని కొన్ని పాత క్యాసెట్ టేపుల ద్వారా కనుగొంటుంది. ఈ ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. షైమా ఎల్ ఫదుల్ ప్రధాన పాత్ర పోషించారు. ఇప్పటికే హాలీవుడ్, ఆసియా, యూరప్ సినిమాలకు అద్భుతమైన సంగీతం అందించి ప్రపంచ ఖ్యాతి పొందిన రెహమాన్, ఇప్పుడు అరబిక్ చిత్రంతో తన కీర్తిని మరింత విస్తరించుకున్నారు.

## 83 ఏళ్ల వయసులోనూ అమితాబ్‌కు నిద్రలేని రాత్రులు.. బిగ్‌బీని వేధిస్తున్న ఆ ఆలోచన ఏంటి?



బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ (బిగ్ బీ) 83 ఏళ్ల వయసులోనూ కుర్ర హీరోలకు పోటీనిస్తూ వరుస సినిమాలతో బిజీగా గడుపుతున్నారు. వయసు కేవలం అంకె మాత్రమేనని నిరూపిస్తూ ఆయన చూపిస్తున్న అంకితభావం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. అయితే తాజాగా ఆయన తన బ్లాగ్‌లో పంచుకున్న ఓ పోస్ట్ వైరల్‌గా మారింది. గత కొన్ని రోజులుగా పనికి సంబంధించిన ఆలోచనల వల్ల తనకు రాత్రిళ్లు నిద్ర పట్టడం లేదని అమితాబ్ వెల్లడించారు. ఒక షూటింగ్ పూర్తి చేసిన తర్వాత ఆ సీన్‌ను ఇంకా బాగా చేసి ఉండాల్సింది అనే అసంతృప్తి అమితాబ్‌లో కలిగిందట. దాంతో డైరెక్టర్ అనుమతి తీసుకుని ఆ సీన్‌ను మళ్లీ రీ-షూట్ చేశారు. అయితే రెండోసారి చేసిన ఔట్‌పుట్ మొదటిదానికంటే బాగా వచ్చిందా లేదా అనే సందేహాలు, ఆలోచనలు ఆయన్ను రాత్రంతా వెంటాడాయట. ఆ టెన్షన్ వల్ల కనురెప్ప మూయకుండానే తెల్లవారిపోయిందని, ఈ విషయం ప్రేక్షకులు చూశాకే తేలుతుందని తన బ్లాగ్‌లో రాసుకొచ్చారు. గత వారం కూడా అమితాబ్ తన హెవీ వర్క్ షెడ్యూల్ గురించి అభిమానులతో పంచుకున్నారు. ఒక్క రోజులోనే ఏకంగా 12 షార్ట్ ఫిల్మ్స్ (యాడ్స్), 2 స్టిల్ షూట్స్ పూర్తి చేశానని, పని ఎప్పుడూ ఆపకూడదని పేర్కొన్నారు. తన అభిమానులను 'ఎక్స్‌టెండెడ్ ఫ్యామిలీ'గా పిలిచే బిగ్‌బీ.. ఎంత అలసిపోయినా రాత్రి 3 గంటలకు కూడా వారితో బ్లాగ్ ద్వారా టచ్‌లో ఉండటం విశేషం. ప్రస్తుతం అమితాబ్ బచ్చన్ చేతినిండా క్రేజీ ప్రాజెక్టులతో ఉన్నారు. పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ సినిమా 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్‌లో ఆయన మళ్లీ 'అశ్వత్థామ'గా కనిపించనున్నారు. దీనితో పాటు రణ్‌బీర్ కపూర్ 'రామాయణ: పార్ట్ 1', అలాగే 'సెక్షన్ 84' చిత్రాల్లో ఆయన కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## బాలయ్య సినిమాలో కాజల్.. ఫస్ట్ లుక్ విడుదల




నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'ఎన్‌బీకే111' నుంచి ఒక అదిరిపోయే అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోందని టీమ్ అఫీషియల్‌గా అనౌన్స్ చేసింది. అంతేకాదు, ఈరోజు కాజల్ బర్త్‌డే సందర్భంగా ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఎప్పుడూ అల్ట్రా గ్లామరస్‌గా కనిపించే కాజల్.. ఈ పోస్టర్‌లో పక్కా డీసెంట్ అండ్ ఇంటెన్సివ్ లుక్‌లోకి మారిపోయింది. నీలిరంగు గళ్ళ చీర, కళ్లద్దాలు పెట్టుకుని, జుట్టు ముడివేసి ఒక పవర్‌ఫుల్ ప్రభుత్వ అధికారిణిలాగా లేదా ఒక సీరియస్ లాయర్ లాగా కనిపిస్తోంది. ఆమె వెనుక ఉన్న పాత రోజుల నాటి ఆఫీస్ సెటప్, టేబుల్‌పై ఉన్న ఫైళ్లు చూస్తుంటే.. బాలయ్య సినిమాలో కాజల్ క్యారెక్టర్‌కు చాలా వెయిట్ ఉందని అర్థమవుతోంది. గతంలో బాలయ్య-గోపీచంద్ మలినేని కాంబోలో వచ్చిన 'వీరసింహారెడ్డి' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టించిందో మనకు తెలిసిందే. ఇప్పుడు అదే కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో అంచనాలు ఆకాశంలో ఉన్నాయి. ఈ భారీ యాక్షన్ డ్రామాను వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ఎక్కడా రాజీ పడకుండా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.







